# కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ

- డాక్టర్ కె. మలయవాసిని
తెలుగు శాఖ, ఆంధ్రా యూనివర్శిటీ.

సరస్వతీ స్వరూపిణి, కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారు నాకు గురుతుల్యులు. ఆమెను గురించి మా నాన్నగారు ఆంధ్ర శేషగిరిరావుగారు గొప్పగా చెబుతూండేవారు. నాళం కృష్ణారావుగారి అమ్మాయి అనీ, ఆమె 'కృష్ణకుమారి' అనే పేరుతో 'నాచన సోమనాథుడు - నవీన గుణ సనాథుడు' అనే విమర్శక వ్యాసం రాసారనీ దాన్ని వెదికి తీసి నాకు ఇచ్చారు. 1960లో నన్ను తెలుగు ఆనర్సుకు పంపుతూ ఇచ్చిన పుస్తకాల్లో ఆ పుస్తకం కూడా ఒకటి. ఆమె పేరు, ఆమె రచన అలా పరిచయం అయ్యాయి నాకు.

ఆ తరువాత ఆమె రాసిన ఆంధ్ర కవయిత్రులు పరిశోధక గ్రంథం ద్వారా ఆమె పరిచయం అయ్యారు. ఆనర్సు క్లాసులో ఆమెను గురించి ఆమె ఉపన్యాసధోరణి గురించి ఆచార్య యస్వీ జోగారావుగారు బహుధా ప్రశంసించేవారు. వారి మాటలు విన్నప్పుడల్లా ఆమె ఉపన్యాసం వినాలనే కూతూహలం పెరుగుతూ ఉన్నది.

1961లో వారి అమ్మాయి శ్రీమతి సుహాసిని ఎం.ఎ. లో చేరింది. మేమిద్దరం ఎంతో సన్నిహితంగా మసలే వాళ్లం. శ్రీమతి సుహాసిని నన్ను సహోదరిగా భావించి ఎన్నో విషయాల్లో నాకు మార్గదర్శకంగా ఉండేది. ఇప్పటికీ ఆమెకు నామీద అవ్యాజమైన ప్రేమే. ప్రియమైన చెల్లీ అని ఉత్తరాలు రాస్తూ ఉంటుంది.

1962లో మహారాజా కాలేజీ విజయనగరం ప్రిన్స్‌పాల్ వసంతరావు వెంకటరావు గారు శ్రీమతి లక్ష్మీకాన్తమ్మగారిని ఆ కళాశాల వార్షికోత్సవానికి ప్రధాన అతిధిగా ఆహ్వానించారు. ఆమె విశాఖ వచ్చారు. కంచెర్ల వారి యింట్లో బస చేశారు. మా హాస్టల్ విద్యార్థినుల అభ్యర్థన మేరకు హాస్టల్‌లో చక్కని ప్రసంగం చేసారు. శ్రీనాథుడు వర్ణించిన 'కంచుగీసిన తెరంగున ఎలుంగెత్తి'' భాషించడం ఆనాడు విన్నాను. ఆ వాక్పటిమ, ఆకంఠమాధుర్యం, ఆ భావగాంభీర్యం, ఆ విషయ విశ్లేషణా పద్ధతి ఈ నాటికీ నా చెవుల్లో మారుమ్రోగుతూనే ఉన్నాయి. చదువుకునే ఆడపిల్లలు సంఘంలో ఎంతధైర్యంగా వ్యవహరించాలో, కార్యకలాపాలు ఎలా నిర్వర్తించుకోవాలో, సాంఘిక దురాచారాల్ని ఎలా ఎదుర్కోవాలో, ఎట్టి పరిస్థితుల్లోనైన మన సంస్కృతి సంప్రదాయాల్ని ఎలా పరిరక్షించుకోవాలో వివరించి చెప్తున్న విధానానికి ఆనాడు ముగ్ధులమైపోయాం. హాస్టల్ వార్డెన్ శ్రీమతి రుక్మిణమ్మగారు లక్ష్మీకాన్తమ్మగారిని ప్రియమార కౌగలించుకుని ఆమె ఉపాన్యాసాన్ని పలురీతుల కొనియాడారు. మీరంతా

ముందు ధైర్యంగా మాట్లాడడం నేర్చుకోండి అంటూ మమ్మల్ని హెచ్చరించారు ముగింపు మాటల్లో.

ఆమార్నాడు డా॥ లక్ష్మీకాన్తమ్మగారు విజయనగర ప్రయాణం. సుహాసినితోపాటు నన్నూరమ్మన్నారు. మేమంతా కారులో విజయనగరం వెళ్ళాం. వేంకటరావుగారికి పరిచయం చేస్తూ ఆమె సుహాసిని, ఈమె మలయ వాసినీ. ఇద్దరూ మా అమ్మాయిలే అన్నారు. ఆ తరువాత ఆంధ్ర విదుషీమణులు రాసిన ఆంధ్ర శేషగిరిరావుగారి అమ్మాయి. ఇద్దరూ వాల్తేరులో ఒక హాస్టల్‌లో ఉన్నారని పరిచయం చేసారు. ఆనాటి నుండి నన్ను అమ్మాయిగానే చూసుకున్నారు. మహారాజా కాలేజీలో పెద్దవేదికమీద వేయిమందికి పైగా ఉన్న విద్యార్థుల సభలో - అంతకు ముందు వక్తలు మాట్లాడుతూ ఉండగా కోతి చేష్టలు చేసిన విద్యార్థులు - శ్రీమతి లక్ష్మీకాన్తమ్మగారి జలదస్వన గంభీరోపన్యాసం ప్రారభం కాగానే చేష్టలు దక్కి కూర్చున్నారు. "వింజమాకిడి నట్లుండె విశ్వసభయు అన్న వాక్యం గుర్తుకి వచ్చింది. ఉపన్యాసం చివరిలో ఎవరో విద్యార్థి కూసిన కూతకి ఆమె - ఈ సభలో "శీతమర్కటాలే" అనుకున్నాను - పుంస్కోకిలలు కూడా ఉన్నాయేఅంటూ, ఆ అల్లరిని తీవ్రంగా నిరసిస్తూ మందలించారు. వేంకటరావుగారు ముగింపుమాటల్లో ఆమె మందలింపు కూడా మధురగంభీరంగా ఉందని చమత్కరించారు. ఆమెతో పరిచయం ఒక మహద్భాగ్యం. ఆమె ఉపన్యాసం వినడం ఒక అదృష్టం.

మా ఆడపడుచుగారి ఊరు బాపట్ల కావడంతో బాపట్ల వెళ్ళినప్పుడల్లా ఆమెను చూసివచ్చేదాన్ని ఎప్పుడు మాట్లాడినా ఆమె రాసిన పుస్తకాల గురించో, ఆమె నిర్వహించిన సభల గురించో ఎంతో ఉత్సాహంగా చెప్తూ ఉండేవారు. వార్ధక్యమనేది వారి మనస్సుకు అంటనేలేదు. ఆమె నిత్యోత్సాహి 'అఖిల భారత రచయిత్రులు కూరుస్తున్న రోజుల్లో ఒకసారి వారి ఇంటికి వెళ్ళాను. ఆ రచనకు సంబంధించిన వ్యాసాలన్నీ పెట్టుకుని ఎంతో దీక్షతో పనిచేస్తున్నారు. ఆ దీక్ష ఆమెకు దైవదత్తం అని పించింది.

లక్ష్మీకాన్తమ్మగారు ఆమె రాసిన 'నా తెలుగు మంచాల' పుస్తకానికి నన్ను పుత్రికా వాత్సల్యంతో పీఠిక రాయమని కోరడం నాకెంతో ఆనందాన్ని కలిగించింది. అది ఆమె నాకు కలగజేసిన ఒక మంచి అవకాశంగా భావిస్తూ ఉంటాను. ఆ పుస్తకం తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం కూడా పొందింది.

ఆమె గురించి చెప్పవలసిన మరో ముఖ్య విషయం 1976లో ఆంధ్ర విశ్వకళాపరిషత్ స్వర్ణోత్సవాల్లో ఆమె అందుకున్న కళాప్రపూర్ణ గౌరవం గురించి. నేను ఆంధ్ర

విశ్వకళాపరిషత్‌లో లెక్చరర్‌గా జేరిన కొత్త. తెలుగు సాహిత్యరంగంలో కృషిచేసిన ఈ విదుషీమణికి అందిన గొప్ప పురస్కారం అది. ఆనాడు ఆమె ముఖంలో వెలిగిన విజయగర్వరేఖ ఈ నాటికీ మర్చిపోలేను. నిరంతరం చిరుహాసంతో నిండయిన విగ్రహం ఆమెది. ఆనాడు ఎందరో ఆమెను అభినందనలతో ముంచెత్తారు. ఆదృశ్యం చూసే భాగ్యం నాకూ కలిగింది.

ఆ తరువాత మళ్లీ ఏలూరులో శ్రీమతి సుహాసిని పుస్తకావిష్కరణ సభలో ఆమందస్మితీ విజయరేఖ ఆమెలో చూసాను నేను. తల్లీకూతుళ్ళు కలిసిరాయడమే అపురూపం. అందునా కలిసి ఒక వ్యాస సంపుటిని కూర్చడం అపూర్వం. ఆనాటి సభ ఎంతో విలక్షణంగా జరిగింది. ఆ సభలో ప్రత్యేకత శ్రీమతి లక్ష్మీకాన్తమ్మగారు తనకు లభించిన గృహలక్ష్మీ స్వర్ణకంకణాన్ని తమ వారసురాలు సుహాసిని చేతికి తొడిగి మురిసిపోవడం అదొక అపూర్వ సన్నివేశం. ఆనాడే నాకు ఆమె 'సాహితీరుద్రమ' స్వీయచరిత్రను 'సరస్వతీ సామ్రాజ్యవైభవము' అనే రూపకాన్ని బహూకరించారు. ఆమె స్వీయ చరిత్ర చదువుతూ ఉంటే ఎంత సాహిత్యకృషి, ఎంతటి సాంఘిక కృషి - ఇల్లాలై, తల్లియై కూడా అవిశ్రాంతంగా శ్రమించారీమె అనిపించింది. బాల్యం నుండి తన ఉపన్యాసాలతో ఆంధ్రజాతిని ఉర్రూతలూగించి, ఉత్తేజపరచిన ఉపన్యాస శిరోమణి ఆమె. ఉపన్యాసకురాలిగా ప్రసిద్ధికెక్కిన తొలితెలుగు మహిళామణి ఆమె.

గుప్తా ఫౌండేషన్ వారి ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకునే లోపు ఆమె ఈ లోకం నుండి నిష్క్రమించారు. ఆంధ్రదేశంలో ఆమె అందుకోని పురస్కారం లేదంటే అతిశయోక్తిలేదు. ఆమెవల్ల ప్రభావితులైన మహిళామణులెందరో, ఆమెకు పరోక్షశిష్యు లెందరో ఆధీరురాలు స్త్రీ జాతికి మార్గదర్శకురాలు.

తెరచిన పుస్తకంవంటి ఆమె జీవితం సర్వులకు పఠనీయం.